సాక్షి
జనగామ

శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024



ప్రయాణం.. పైలం

టెన్త్, ఇంటర్ విద్యార్థులకు వేసవి సెలవులు మొదలయ్యాయి. విహారయాత్రలు చేసే వారు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

- 8లో▸



ఓవరాల్ చాంపియన్ కేఎంసీ

అంతర్ కళాశాలల స్థాయి అథ్లెటిక్స్ పోటీల ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఆతిథ్య కేఎంసీ క్రీడాకారులు కైవసం చేసుకున్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
42^0 /26^0

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది. రాత్రి పూట ఉక్కపోత పెరుగుతుంది.



న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ అంకిత్ కుమార్



జనగామ: జనగామ ఏసీపీగా అంకిత్ కుమార్ సంక్వార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కలెక్టర్ రిజ్వాన్ బాషాతో పాటు డీసీపీ పి.సీతారాంను మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకు ముందు జనగామ, నర్మెట సీఐలు, డివిజన్‌లోని ఎస్సైలు ఏసీపీని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ఎన్నికల చెక్ పోస్టుల తాత్కాలిక ఎత్తివేత

జనగామ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఆరు చోట్ల ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల (స్టాటికల్ సర్వైలెన్స్ టీంల)ను ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు పోలీసులు తాత్కాలికంగా తొలగించారు. గత నెల 19న వరంగల్–హైదరాబాద్ ఎన్‌హెచ్ పెంబర్తి, కొడకండ్ల మండలం మొండ్రాయి, బచ్చన్నపేట మండలం కొన్నె, తరిగొప్పుల మండలం ఎన్యానాయక్‌తండా, లింగాలఘణపురం మండలం జీడికల్, జఫర్‌గఢ్ మండల కేంద్రంలో చెక్ పోస్టుల తనిఖీలను నిలిపి వేశారు. ఈ నెల 18వ తేదీన ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చిన తర్వాత తిరిగి ప్రారంభిస్తామని డీసీపీ పి.సీతారాం తెలిపారు.

జిజ్ఞాస పోటీల్లో ఏబీవీ విద్యార్థుల ప్రతిభ



జనగామ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థుల్లోని పరిశోధన నైపుణ్యాలను వెలికి తీయడానికి రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన జిజ్ఞాస స్టడీ ప్రాజెక్ట్ పోటీల్లో పట్టణంలోని ఏబీవీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని ఇందిర ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో తెలుగు, గణితం, ఇంగ్లిష్ భాషల్లో ప్రాజెక్ట్‌లు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు శైలజ, సంధ్యారాణి, శ్రీనివాస్, సులేమాన్, కల్యాణి అభినందించారు.

మాదిగల ద్రోహి కాంగ్రెస్



జనగామ రూరల్: మాలలతో కుమ్మక్కై మాదిగలకు ద్రోహం చేసిన పార్టీ కాంగ్రెస్ అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ అన్నారు. మంద కృష్ణమాదిగను కడియం శ్రీహరి విమర్శించడంపై పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగల అండతోనే రాజకీయంగా ఎదిగానని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలను అణచివేయాలని చూడడం న్యాయం కాదన్నారు. అలాగే పదవుల కోసం పార్టీ మారే కడియంకు మంద కృష్ణను విమర్శించే అర్హత లేదన్నారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఏ ఒక్క మాదిగను ఎదగకుండా కుట్రలు చేస్తున్నారని, ఇలాంటి రాజకీయాలు ఎక్కువ కాలం సాగవన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, గద్దల కిషోర్, రాజు, రవీందర్, కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మూల్యాంకనం

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్ స్పాట్ వ్యాల్యుయేషన్ ప్రక్రియ గురువారంతో ముగిసింది. గత నెల 15 నుంచి అన్ని సబ్జెక్టులు కలిపి నాలుగు దశల్లో ఇంటర్మీడియట్ జవాబు పత్రాల వ్యాల్యుయేషన్ ప్రక్రియ కొనసాగింది. ఈస్పాట్‌లో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాలల, గురుకులాల, మోడల్ స్కూల్స్ అధ్యాపకులు పాల్గొన్నారు. క్యాంపు ఆఫీసర్‌గా డీఐఈఓ గోపాల్, ఏసీఓ–1గా ధర్మేంద్ర వ్యవహరించారు.



నేటి నుంచి వసంతోత్సవం

స్ప్రింగ్ స్ప్రీ-24 వేడుకలకు సిద్ధమైన నిట్

- రాసెంగాన్‌గా మూడ్రోజుల కల్చరల్ ఫెస్ట్
- అలరించనున్న ప్రోషోలు



కాజీపేట అర్బన్: స్ప్రింగ్ స్ప్రీ–24 వేడుకలకు నిట్ వరంగల్ వేదిక కానుంది. మూడ్రోజులు నిర్వహించే ఈ వేడుకలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. సంస్కృతీ సంప్రదాయాలు, వారసత్వ సంపదను పరస్పరం పంచుకునే వేదికగా నిట్ వరంగల్ విద్యార్థులే నిర్వాహకులుగా 1978లో ఈ వేడుకల్ని ప్రారంభించారు. వార్షిక సాంస్కృతిక మహోత్సవం అనతి కాలంలోనే దక్షిణ భారత అతి పెద్ద వసంతోత్సవం(కల్చరల్ ఫెస్ట్)గా పేరుగాంచింది. నిట్‌తో పాటు వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి ఆరువేల మంది విద్యార్థులు ఈఫెస్ట్‌లో పాల్గొననున్నారు. తొలి రోజు శుక్రవారం సాయంత్రం నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ లాంఛనంగా నిట్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో ఈ ఫెస్ట్‌ను ప్రారంభించనున్నారు.

ఆకట్టుకోనున్న కార్యక్రమాలు

స్ప్రింగ్‌స్ప్రీ–24లో భాగంగా సంస్కృతీ సంప్రదాయాలను పంచుకునే వేదికలో 35కుపైగా ఈవెంట్స్‌తో కూడిన వసంతోత్సవంలో ఆర్ట్, లిటరేచర్, డ్రాయింగ్, డ్రామా, డ్యాన్స్, మ్యూజిక్, క్విజ్, ఫొటోగ్రఫీ, పెయింటింగ్, ఫ్యాషన్‌షో కార్యక్రమాలు ఆకట్టుకోనున్నాయి. కొరియో నైట్‌లో డ్యాన్స్, అల్యూర్‌లో ఫ్యాషన్ షోలు, డైరెక్టర్స్ కట్, నుక్కడ్ నాటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

'రాసెంగాన్' అంటే...

ఈ ఏడాది వేడుకలను రాసెంగాన్ థీమ్‌తో నిర్వహిస్తున్నారు. జపాన్‌లో 'నరుడు' అనే నాటకంలోని ఓ క్యారెక్టర్ పేరు రాసెంగాన్. ఈ పాత్ర చాలా పవర్‌ఫుల్. పండుగ వాతావరణం సృష్టించి ఏది కోరుకుంటే అది ఇచ్చేస్తుంది. అలా ఈ ఏడాది స్ప్రింగ్ స్ప్రీ వేడుకలకు 'రాసెంగాన్' థీమ్ అని పెట్టారు.

ఏటా ప్రత్యేక థీమ్‌తో...

విద్యార్థులే నిర్వాహకులుగా నిర్వహించే స్ప్రింగ్‌స్ప్రీ వేడుకలను ప్రతీ ఏడాది ప్రత్యేక థీమ్‌తో ఏర్పాటు చేస్తున్నారు. 2019లో కళాక్షేత్రంగా, 2020లో మైథ్యాస్‌గా, 2022లో సృష్టిగా, 2023లో కళాధ్వనిగా, 2024లో రాసెంగాన్‌గా థీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది పండుగ వాతావరణాన్ని అందిస్తానని, ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయి లక్ష్యమని తెలిపే అర్థంతో రాసెంగాన్‌గా స్ప్రింగ్‌స్ప్రీ–24కు నామకరణం చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా ప్రోషోలు

నిట్ స్ప్రింగ్ స్ప్రీ–24 రాసెంగాన్‌లో ప్రోషోలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. రోజూ సెలబ్రిటీలతో అలరించనున్నాయి. ప్రోషోలో తొలి రోజు చౌరస్తా బ్యాండ్, రెండో రోజు నకాశ్ అజీజ్, లోహర్‌ది బ్లాక్‌స్మిత్, మూడో రోజు డైరెక్టర్స్ కట్ ప్రత్యేకంగా నిలువనున్నాయి.

బెల్ట్‌కు కోడ్ లేదా..?

మత్తెక్కిస్తున్న బెల్టు దుకాణాలు

- పట్టణంలో 100కు పైగా షాపులు
- బాటిళ్లపై సొంత స్టిక్కర్లు.. ఎమ్మార్పీ కంటే అధిక ధరలు
- బ్రాండ్ మద్యంలో జోరుగా కల్తీ..?
- పట్టించుకోని అధికార యంత్రాంగం

పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ.. పట్టణం, పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. బెల్టు దుకాణాలను మూసి వేయాలని ఎలక్షన్ కమిషన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ.. ఇక్కడ మాత్రం నిబంధనలను గాలికి వదిలేశారు. బెల్టు దుకాణాలు 24 గంటల పాటు అందుబాటులో ఉంటున్నాయి. - జనగామ



జిల్లాలో బెల్టు దుకాణాలు పచ్చని కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. తెల్లవారు లేచింది మొదలు రాత్రి ఇంటికి చేరే వరకు 60 ఎంఎల్– 90 ఎంఎల్ లాగించేస్తూ.. పొద్దంతా చేసిన కష్టాన్ని మద్యానికి తగలేస్తున్నారు. చాలామంది యువత, మైనర్లు సైతం మత్తులో తూగుతున్నారు. మైనర్లకు మద్యం బాటిళ్లు ఇవ్వకూడదనే నిబంధనలు.. బెల్టు దుకాణాల్లో వర్తించడం లేదు. సంబంధిత శాఖల అధికారులు 'మామూళ్ల' మత్తులో బెల్టు దుకాణాల కట్టడిని గాలికి వదిలేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జోరుగా కల్తీ

పట్టణం, మండల కేంద్రాల నుంచి మద్యం తీసుకు వెళ్తున్న బెల్టు షాపుల నిర్వాహకులు కల్తీ చేస్తున్నట్లు అనేక గ్రామాల్లో నిత్యం గొడవలు జరుగుతూనే ఉన్నాయి. హైదరాబాద్, హనుమకొండ తదితర ప్రాంతాల నుంచి స్పిరిట్ తీసుకువచ్చి ఖరీదైన మద్యం బాటిళ్లలో కలిపి సొమ్ము చేసుకుంటూ మందుబాబుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారనే చర్చ జరుగుతోంది.

రాత్రి సమయంలో సరుకు సరఫరా..

గతంలో బెల్టు షాపుల నిర్వాహకులు మద్యం దుకాణాలు తెరిచిన పది నిమిషాల్లో బాటిళ్లు తీసుకువెళ్లే వారు. ప్రస్తుతం ఎలక్షన్ కోడ్ అమలులో ఉండడంతో రాత్రి వైన్స్‌లు మూసి వేసే సమయానికి గంట ముందు వచ్చి ఎవరికి అనుమానం రాకుండా తీసుకెళ్తున్నట్లు సమాచారం.

దుకాణం పక్కనే సిట్టింగ్‌లు

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా అవుతోంది. దుకాణాల పక్కనే సిట్టింగులను ఏర్పాటు చేసి మందులోకి రకరకాల ఫుడ్ ఐటెంలు సైతం అందుబాటులో ఉంచుతున్నారు. ఇదే అదనుగా క్వార్టర్, ఆఫ్, ఫుల్ బాటిళ్లపై స్టిక్కర్లు వేస్తూ.. ఎమ్మార్పీ కంటే రూ.20, రూ.40, రూ.80 అదనంగా తీసుకుని విక్రయిస్తున్నట్లు మద్యం ప్రియులు చెబుతున్నారు.

పట్టణంలో 100కు పైగా..

కలెక్టర్, డీసీపీ, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు, 24 గంటలు పోలీసు పెట్రోలింగ్‌తో నిఘా ఉన్నా జిల్లా కేంద్రంలో 100కు పైగా బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారు. రాత్రి.. పగలు అనే తేడా లేకుండా అన్ని రకాల బ్రాండ్ల మద్యం, బీర్లు అందుబాటులో ఉంటున్నాయి. వీవర్స్‌కాలనీ, ధర్మకంచ, చమన్, లేబర్ అడ్డా, నర్మెటరోడ్డు పాత గోదాంలు, బాణాపురం, ప్రెస్టన్ ఏరియా, బతుకమ్మకుంట, రంగప్పచెరువు, గ్రెయిన్ మార్కెట్ తదితర శివారు ప్రాంతాల్లో మద్యం తాగుతూ ఖాళీ బాటిళ్లను అక్కడే వదిలేసి వెళ్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఇంతకు ముందు మద్యం మత్తులో రోడ్డున వెళ్లే వారిని భయభ్రాంతులకు గురిచేసిన ఘటనలు అనేకం ఉన్నాయి.

సీఎంఆర్ లక్ష్యాలు పూర్తి చేయాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: వానాకాలం(2023–24) సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం ఆయన ఓబుల్‌కేశ్వాపూర్‌లోని మహాలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్(బాయిల్డ్ రైస్‌మిల్), ధాన్య మిత్ర రా రైస్ మిల్‌ను సందర్శించారు. అనంతరం వానా కాలానికి సంబంధించి దిగుమతి అయిన ధాన్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లర్లకు కేటాయించిన రోజువారీ లక్ష్యాలు చేరుకోవాలని చెప్పారు. అలాగే యాసంగి 2023–24 సంబంధించిన సీఎంఆర్ ధాన్యం నిల్వ చేసేందుకు గోదాముల్లో సరిపడా స్థలం ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎఫ్‌సీఐకి సీఎంఆర్ బియ్యం తరలించే విధానం, గన్నీ బ్యాగుల గురించి ఆరా తీశారు. కలెక్టర్ వెంట డీఎస్‌ఓ రోజారాణి, డీఎం సీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మహాలక్ష్మి రైస్ మిల్లులో పరిశీలిస్తున్న కలెక్టర్

పట్టభద్రుల ఓటరు తుది జాబితా విడుదల

- జిల్లాలో 23,319 మంది ఓటర్లు



జనగామ తహసీల్ కార్యాలయంలో జాబితా ప్రదర్శన

జనగామ: వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ అధికారులు గురువారం పట్టభద్రుల తుది ఓటరు జాబితా ప్రకటించారు. జిల్లాలో మొత్తం 23,320 మంది ఓటర్లు ఉండగా.. అందులో పురుషులు 14,862, మహిళలు 8,457 మంది ఉన్నారు. 2023 డిసెంబర్ 30 నుంచి 2024 ఫిబ్రవరి 23 వరకు అర్హత కలిగిన పట్టభద్రుల నుంచి ఓటరు నమోదు దరఖాస్తులు తీసుకున్నారు. ఫిబ్రవరి 24న ముసాయిదా జాబితా విడుదల చేసి మార్చి 14 వరకు అభ్యంతరాలను స్వీకరించి.. 29 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిష్కరించారు. గురువారం తుది జాబితా విడుదల చేశారు. ఓటరు జాబితాను జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ కార్యాలయాలతో పాటు 27 పోలింగ్ బూత్‌లు, తహసీల్ ఆఫీసుల బోర్డులపై అందుబాటులో ఉంచారు.

జిల్లాలో పట్టభద్రుల ఓటర్ల వివరాలు మండలాల వారీగా..

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
నర్మెట	686	366	1,052
తరిగొప్పుల	366	192	558
బచ్చన్నపేట	1,271	716	1,987
జనగామ	3,503	2,382	5,885
లింగాలఘణపురం	1,092	583	1,675
రఘునాథపల్లి	1,181	637	1,818
స్టేషన్‌ఘన్‌పూర్	1,237	790	2,027
చిల్పూరు	741	403	1,144
జఫర్‌గఢ్	981	531	1,512
పాలకుర్తి	1,686	809	2,495
దేవరుప్పుల	1,219	642	1,861
కొడకండ్ల	899	406	1,305
మొత్తం	14,862	8,457	23,319

ఎమ్మెల్యేను బర్తరఫ్ చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా

జనగామ: ఫోన్ ట్యాపింగ్‌తో ప్రత్యర్థి పార్టీల వ్యక్తిగత సమాచారాన్ని రాబట్టి అప్రజాస్వామికంగా గెలుపొందిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు గురువారం జిల్లా కేంద్రం ఆర్టీసీ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన, ధర్నా కార్యక్రమం చేపట్టారు. అనంతరం టీపీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సర్వల నర్సింగరావు, పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిర, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బనుక శివరాజ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కళ్యాణిమల్లారెడ్డి, మేడ శ్రీనివాస్ మాట్లాడారు. రాజేశ్వర్‌రెడ్డి రాజ్యాంగానికి విరుద్ధంగా గెలుపొందారని, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనగామ, బచ్చన్నపేట మండలాల అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, నూకల బాల్‌రెడ్డి, నాయకులు మాసపేట రవీందర్‌రెడ్డి, బొట్ల నర్సింగరావు, కాగితపురం మహేందర్ రెడ్డి, ధర్మ గోవర్ధన్‌రెడ్డి, రంగరాజు ప్రవీణ్, చెంచారపు కరుణాకర్ రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'అమ్మ ఆదర్శ' స్కూళ్లలో సదుపాయాలు కల్పించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ మొగులప్ప

పాలకుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అమ్మ ఆదర్శ' పాఠశాలల్లో మెరుగైన విద్య అందించేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని డీఆర్‌డీఓ మొగులప్ప అన్నారు. గురువారం మండల వనరుల కేంద్రంలో నోడల్ అధికారి నర్సయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి విడతలో 29 పాఠశాలలను గుర్తించామని, వాటిలో తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల నిర్మాణం, మరమ్మతు చేపట్టాలన్నారు. వేసవి సెలవుల్లో పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఆర్‌అండ్‌బీ డీఈ జీవన్‌కుమార్, ఎంపీడీఓ రాములు మాట్లాడారు.

బియ్యం పట్టుకుని వదిలేశారు..!

- రూ.50వేల లంచం తీసుకున్నదెవరు..?
- పట్టణంలో చర్చకు దారితీసిన ఘటన



జనగామ: పట్టణానికి చెందిన ఓ వ్యాపారి పీడీఎస్(రేషన్) బియ్యం అక్రమ రవాణా చేస్తుండగా పట్టుబడిన సంఘటనలో బేరసారాల ముచ్చట ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఊరూరా సేకరించిన రేషన్ బియ్యం కొనుగోలు చేసే సదరు వ్యాపారి.. జిల్లా కేంద్రంలోని ఓ గోదాంలో నిల్వచేశాడు. ఇలా నిల్వ చేసిన బియ్యం బ్యాగులను గత నెలలో గజ్వేల్‌కు తరలించే క్రమంలో పోలీసు శాఖకు చెందిన అధికారులకు సమాచారం అందగా గోదాం వద్దకు వెళ్లారు. 60 క్వింటాళ్లకు పైగా రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిసింది. అయితే ఇందులో 20 క్వింటాళ్ల బియ్యం మాత్రమే పట్టుకుని పంచనామా చేసి మిగితా వాటి వివరాలను గోప్యంగా ఉంచినట్లు సమాచారం. భారీ మొత్తంలో బియ్యం పట్టుబడితే జైలుకు వెళ్లే అవకాశం ఉంటుందని వ్యాపారిని భయపెట్టి మధ్యవర్తుల సహకారంతో బేరసారాలకు దిగినట్లు చర్చ జరుగుతోంది. మొదట రూ.లక్ష డిమాండ్ చేసి.. చివరకు రూ.50వేలకు సెటిల్‌మెంట్ అయినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే 'మామూళ్ల' పంపకం విషయంలో బెడిసి కొట్టడంతో ఈ విషయం బయటకు వచ్చింది. ఈ ఘటనపై ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందినట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై నిఘా వర్గాల ప్రతినిధులు సీపీకి రిపోర్ట్ చేసినట్లు మాట్లాడుకుంటున్నారు.

ఆ ముగ్గురికి తీహార్ జైలే దిక్కు

- ఎమ్మెల్యే 'పల్లా' ఫోన్ ట్యాపింగ్ చేశాడు
- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: ఫోన్ ట్యాంపింగ్‌తో పాటు వేల కోట్ల అక్రమ సంపాదన కూడబెట్టిన కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుకు తీహార్ జైలే దిక్కు అని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గురువారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో టీపీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కొమ్మూరి మాట్లాడారు. కేసీఆర్ ఏం కష్టం చేసి వేల కోట్ల ఆస్తులు సంపాదించారని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాల్సింది పోయి నాలుగున్నర కోట్ల ప్రజలపై రూ.7లక్షల కోట్ల అప్పుల భారం మోపారన్నారు. పార్లమెంట్‌లో బీజేపీ రైతులకు వ్యతిరేకంగా బిల్లు పెడితే తిరస్కరించాల్సి ఉండగా.. బీఆర్ఎస్ ఎంపీలతో వారికి మద్దతుగా ఓట్లు వేయించిన కేసీఆర్ ఇప్పుడు అన్నదాతల కోసం పగటి వేషాలు వేస్తున్నాడని ధ్వజమెత్తారు. ఆయనకు డబ్బు, భూములపై ఉన్న ప్రేమ ప్రజలు, రైతులపై లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేర్యాల, జనగామలోని తన ఇళ్లకు 100 మీటర్ల దూరంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇల్లు, ఆఫీసు అద్దెకు తీసుకుని, తన ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లు ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి కలిసి ఎన్నికల సమయంలో రాష్ట్రంలోని 100 నియోజకవర్గాల్లో ఫోన్ ట్యాపింగ్ చేశారని, ఈ విషయమై ప్రభుత్వం విచారణ చేపట్టాలని కోరారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి సరైన పద్ధతిలో ఖర్చులు చూపించలేదని, దీనిపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 6వ తేదీన తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి 5వేల మందిని తరలించనున్నట్లు తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

- కొత్తగా ఆయుర్వేద, హోమియో ఆస్పత్రులకూ వర్తింపు
- ఉమ్మడి జిల్లా అబ్జర్వర్ డాక్టర్ రవితేజ



సమీక్షలో మాట్లాడుతున్న డాక్టర్ రవితేజ

జనగామ: జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులతో పాటు కొత్తగా ఏర్పాటు చేసే ఆయుర్వేద, యునాని, హోమియో దవాఖాన, ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ ఉమ్మడి జిల్లా అబ్జర్వర్ డాక్టర్ రవితేజ తెలిపారు. కలెక్టరేట్ డీఎంహెచ్‌ఓ చాంబర్‌లో గురువారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీష్‌రాజుతో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం రవితేజ మాట్లాడుతూ ప్రస్తుతం కాల పరిమితి పూర్తయిన ప్రైవేట్ ఆస్పత్రులు వారం రోజుల్లో రిజిస్ట్రేషన్ రెన్యూవల్ పూర్తి చేసుకోవాలని చెప్పారు. అలాగే కొత్తగా అమలులోకి వచ్చిన నిబంధనల మేరకు ఆస్పత్రుల యాజమాన్యాలు రిజిస్ట్రేషన్ చేసుకోకుంటే జరిమానా విధించడంతో పాటు సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులు సైతం కామన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు ఆర్‌బీఎస్‌కేపై రివ్యూ నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ మహేందర్, డాక్టర్లు శ్రీదేవి, అశోక్‌కుమార్, భాస్కర్, కరుణాకర్‌రాజు, మాస్ మీడియా ప్రతినిధి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఫేక్ కాల్స్‌పై విచారణ



వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్

తొర్రూరు: మున్సిపాలిటీ ట్రేడ్ లైసెన్స్ చెల్లించాలని ఆగంతకుడి నుంచి పట్టణంలోని ఓ సూపర్ మార్కెట్ నిర్వాహకుడికి ఫేక్ కాల్స్ రావడంపై మున్సిపల్ అధికారులు విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. ట్రేడ్ లైసెన్స్ చెల్లించాలని, రూ.9,999 చెల్లిస్తే మున్సిపాలిటీ నుంచి లైఫ్ కార్డు అందిస్తామని ఓ ఆగంతకుడు పట్టణంలోని ఓ సూపర్ మార్కెట్ నిర్వాహకుడికి ఫోన్ చేశాడు. దీని కోసం ఫోన్ పే చేయాలని, ఒకసారి చెల్లిస్తే శాశ్వతంగా ట్రేడ్ లైసెన్స్ చెల్లించాల్సిన పని ఉండదని నమ్మబలికాడు. అనుమానం వచ్చిన నిర్వాహకుడు హోదా అడగగా తాను కమిషనర్‌ని అని తెలిపాడు. దీనిపై మున్సిపాలిటీ అధికారులకు బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా గురువారం సదరు సూపర్ మార్కెట్‌ను కమిషనర్ శాంతి కుమార్ సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాల్ రికార్డు విన్న కమిషనర్ అది ఫేక్‌గా నిర్ధారించారు. కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అధికారులమని చెప్పి ట్రేడ్ లైసెన్స్, ఇతర పనుల పేర డబ్బులు వసూలు చేసేందుకు వచ్చే కాల్స్‌ను నమ్మొద్దన్నారు. అలాంటి కాల్స్ వస్తే మున్సిపాలిటీ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. విచారణలో మేనేజర్ కట్టా స్వామి, ఏఈ రంజిత్, హెల్త్ అసిస్టెంట్ రాజు, వార్డు ఆఫీసర్ దేవేందర్ తదితరులు ఉన్నారు.

బాలలను తరలిస్తున్న వ్యక్తుల పట్టివేత



పట్టుకున్న బాలలతో కాజీపేట జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు

కాజీపేట రూరల్ : హైదరాబాద్‌లో పని పేరుతో బాలలను తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులు గురువారం జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసుల స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. కాజీపేట జీఆర్పీ ఎస్సై మోహినుద్దీన్ కథనం ప్రకారం.. బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 12 నుంచి 16 సంవత్సరాలలోపు 11 మంది బాలలను హైదరాబాద్‌లో వివిధ పనుల నిమిత్తం తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులు రైల్‌లో స్పెషల్ డ్రైవ్ పోలీసులకు పట్టుబడ్డారు. గోరఖ్‌పూర్–సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో స్పెషల్ డ్రైవ్ చేస్తుండగా బాలలు రైల్వే పోలీసుల కంట పడ్డారు. అనుమానంతో వారి వద్దకు వెళ్లి విచారించగా వారిని హైదరాబాద్‌లో వివిధ పనుల కోసం తరలిస్తున్నారని తెలిసింది. దీంతో కాజీపేట జంక్షన్‌లో 11 మంది బాలలు, ఐదుగురిని రైలు నుంచి దింపి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి 11 మంది బాలలను చైల్డ్‌లైన్ హోంకు తరలించినట్లు తెలిపారు. బాలలను తరలిస్తున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వివరాలు తీసుకుని పంపించారు. కార్యక్రమంలో కాజీపేట జీఆర్పీ సీఐ ఎం.రామ్మూర్తి, కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ ఎం.సంజీవరావు, కాగజ్‌నగర్ ఏఎస్సై దాసు, ఆర్పీఎఫ్ పోలీసులు, సీడబ్ల్యూసీ నుంచి దామోదర్, పి.నరేష్, ప్రవీణ్, కోఆర్డినేటర్ వసుంధర, సీహెచ్.శోభ, కైలాష్ సత్యార్థి ఫౌండేషన్ మహబూబాబాద్ నుంచి సోమన్న పాల్గొన్నారు.



ప్రయాణం.. పైలం

ఉదయం 10 గంటల లోపు పూర్తి చేసుకోవాలి

- వేసవిలో పొంచి ఉన్న వడదెబ్బ
- దూర ప్రయాణాలు శ్రేయస్కరం కాదు..
- కూల్ డ్రింక్స్ ప్రమాదకరం
- పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లే మేలు

ఖిలా వరంగల్ : వేసవి సెలవులు మొదలయ్యాయి. కుటుంబ సమేతంగా స్వగ్రామాలు, బంధువుల ఊళ్లు, విహారయాత్రలు, ఇతర శుభకార్యాలకు సమయం ఇది. అయితే ఎండలు మండుతున్నాయి. ఉదయం 8 దాటిందంటే చాలు.. అడుగు బయట పెట్టే పరిస్థితి ఉండడం లేదు. సాయంత్రం 6 గంటల వరకు ఎండలు, రాత్రి 10 గంటలు దాటినా వడగాలుల తీవ్రత తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో ఈ కాలంలో ప్రయాణ సమయాల్లో ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే అనారోగ్యం కొని తెచ్చుకున్నట్లే. వడదెబ్బ, జ్వరం, తదితర సమస్యల ప్రాణాంతకంగా మారుతున్నాయి. అందుకే ప్రయాణాలు ఉదయం 10 గంటల లోపు ముగిసేలా, సాయంత్రం 5 గంటల తరువాత మొదలయ్యేలా ప్లాన్ చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. నీడ పట్టున ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంటున్నారు.

ప్రయాణంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలి?

బస్సులు, రైళ్లలో ప్రయాణించే సమయంలో విటమిన్ 'బి' లభించే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. కాయగూరలు, ధాన్యాలు, క్యారెట్ ఎక్కువ తీసుకోవాలి. తరుచూ నీరు తాగాలి. తద్వారా శరీరానికి కావాల్సిన ఆక్సిజన్ అందుతుంది. ప్రయాణంలో వాహనం ఆపిన సమయంలో కొబ్బరి నీళ్లు తీసుకోవడం చాలా మంచిది. వదులు దుస్తులు ధరించాలి. తద్వారా శరీరానికి గాలి బాగా తగులుతుంది. పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి.



జన సంచారం లేక నిర్మానుష్యంగా మారిన రహదారి

ప్రయాణంలో మంచినీరు, పండ్ల రసాలు వెంట తీసుకెళ్లాలి. ఓఆర్ఎస్ వెంట తీసుకెళ్లడం మరవొద్దు. పిల్లలకు పలుచని దుస్తులు వేయాలి. ముఖానికి లోషన్స్ తప్పని సరిగా రాసుకోవాలి. వేసవిలో బయట తిరిగే సమయంలో ఉల్లిపాయపై తొక్క తీసి దానిని ప్యాంట్ జేబులో వేసుకోవాలి. మహిళలు హ్యాండ్ బ్యాగ్‌లో ఉంచుకోవాలి. దీని వల్ల వడదెబ్బ తగలదు. ఉల్లిపాయను సగం కోసి పిల్లల చొక్కాలో ఉంచితే మరీ మంచిది. ఉల్లిలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి.

కూల్ డ్రింక్స్ తాగొద్దు

ప్రయాణంలో ఎట్టి పరిస్థితుల్లోనూ కూల్ డ్రింక్స్ తాగొద్దు. వీటిలో ఉండే పాస్ఫారిక్ యాసిడ్ కారణంగా వాంతులయ్యే ప్రమాదం ఉంటుంది. దీనికి తోడు చక్కెర శాతం ఎక్కువ ఉంటుంది. రక్తంలో కలపడం వల్ల షుగర్ లెవల్స్ అమాంతం పెరుగుతాయి. రక్తపోటు పెరుగుతుంది. కూల్ డ్రిక్స్ తాగడం అంటే చిన్న మోతాదులో డ్రగ్స్ తీసుకున్నట్లేనని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రయాణ సమయంలో దాహం వేయకపోయినా తప్పనిసరిగా నీరు తాగాలి. దీని వల్ల వడదెబ్బ నుంచి ఉపశమనం పొందొచ్చు.



వరంగల్‌లో పెరిగిన ఉష్ణోగ్రతలు

వరంగల్ మహానగరంలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. గురువారం గరిష్టం 43 డిగ్రీలు, కనిష్టం 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఫలితంగా భానుడి భగభగలకు నగర రహదారులు నిర్మానుష్యంగా మారాయి. మధ్యాహ్నం కాలనీల్లో ప్రధాన వీధులు కూడా రాకపోకలు లేక వెలవెలబోయాయి. ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు వ్యక్తిగత పనులపై ఉదయం 10లోపు, సాయంత్రం 4తరువాత రోడ్డుపైకి వస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



వేసవి ప్రయాణాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలతో కలిసి విహారయాత్రలకు వెళ్తుంటారు. ఎండ తీవ్రత వల అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంటుంది. ఈ సమయంలోనే శరీరంలోని ఉప్పుశాతం తగ్గిపోయే ప్రమాదం ఎక్కువ ఉంటుంది. ఎక్కువ ద్రవ పదార్థాలు తీసుకోవాలి. పలుచని దుస్తులు ధరించాలి. పిల్లలకు అరగంటకు ఒకసారి ఓఆర్ఎస్, కొబ్బరి నీరు తాగించాలి. నూనె పదార్థాలు తినొద్దు.

డాక్టర్ రవీందర్, పిల్లల వైద్యుడు వరంగల్

పండ్ల రసం ఎక్కువ తీసుకోవాలి



వేసవిలో విహారయాత్రలు, సుదీర్ఘ ప్రయాణాలు శ్రేయస్కరం కాదు. తప్పని పరిస్థితుల్లో వెళ్లాలనుకుంటే పండ్ల రసాలు కొబ్బరి నీరు, నీరు ఎక్కువ తీసుకోవాలి. లేదంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. వీలైనంత వరకు ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 5గంటల తరువాత ప్రయాణం చేయడం ఉత్తమం.

డాక్టర్ నరేష్‌కుమార్, రాష్ట్ర వైద్య మండలి సభ్యుడు

'టెన్త్ స్పాట్'కు టీచర్ల డుమ్మా

- దరఖాస్తుదారులకు విధుల అప్పగింత
- స్పెషల్ అసిస్టెంట్‌లు 45మంది కొరత
- ఆయా సబ్జెక్టుల మూల్యాంకనానికి ఏఈలు లేరు

విద్యారణ్యపురి : పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ హనుమకొండ జిల్లా కాజీపేటలోని ఫాతిమా హైస్కూల్‌లో కొనసాగుతోంది. మొదటి రోజు 50 శాతం మంది ఉపాధ్యాయులు ఏఈలుగా, స్పెషల్ అసిస్టెంట్లు హాజరు కాగా రెండోరోజు గురువారం మరికొందరు హాజరయ్యారు. ఇంకొందరు డుమ్మా కొట్టారు. ఎన్నికల శిక్షణ పేర కూడా కొందరు రాలేదని సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన టీచర్లలో సీనియారిటీ ప్రకారం ఏఈలుగా 1,060మందికి, స్పెషల్ అసిస్టెంట్లుగా 450మందికి ఉత్తర్వులు అందజేసిన కొందరు ఉపాధ్యాయులు వాల్యుయేషన్‌కు దూరంగా ఉన్నారు. స్పాట్ వాల్యుయేషన్ డ్యూటీ పడని ఉపాధ్యాయులు కొందరు ఈనెల 3న క్యాంపు ఆఫీసర్ డీఈఓకు తమకు అవకాశం ఇస్తే స్పాట్ వాల్యుయేషన్ విధులు నిర్వహిస్తామని దరఖాస్తులు చేయగా వారికి గురువారం ఉత్తర్వులిచ్చారు. దీంతో వారు ఆయా విధుల్లో చేరి మూల్యాంకనం చేస్తున్నారు. స్పాట్ విధులు చేయబోమని వివిధ కారణాలు చూపుతూ దరఖాస్తులు చేసుకునేందుకు వచ్చిన ఉపాధ్యాయుల దరఖాస్తులు మాత్రం డీఈఓ తీసుకోవడంలేదు. అయితే వారు వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులకు అప్పగించి వెళ్తున్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్స్ టీచర్లకు కూడా స్పాట్ విధులకు రమ్మని కోరుతున్నారని సమాచారం. స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ సకాలంలో పూర్తివుతుందో లేదో చూడాలి

స్పాట్‌కు టీచర్ల కొరత ఇలా ..

టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియకు ఇంకా 45 మంది స్పెషల్‌అసిస్టెంట్లు కొరత ఉండగా తెలుగు –18, హిందీ–23, బయాలాజికల్ సైన్స్ టీచర్లు 20మంది అవసరం ఉంది. ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు కూడా ఆయా టీచర్లకు సమాచారం అందిస్తున్నారు.

చర్యలు తీసుకోవాలనే యోచనలో డీఈఓ?

టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియకు సీనియారిటీ ప్రాతిపదికన టీచర్లకు విధులను అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ కొందరు హాజరు కావడం లేదు. వారిపై చర్యలు ఎందుకు తీసుకోకూడదని వారికి నోటీసులు లేదా మెమోలు ఇస్తానని డీఈఓ ఎండి అబ్దుల్‌హై తనను కలిసిన ఉపాధ్యాయ సంఘాలతో అన్నారని సమాచారం. అయితే వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు ప్రభుత్వ, జిల్లా పరిషత్ హైస్కూల్స్ ఉపాధ్యాయులే కాకుండా కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లో పనిచేసే ఉపాధ్యాయులను కూడా స్పాట్ విధుల్లోకి తీసుకోవాలని డీఈఓకు సూచించారని తెలుస్తోంది.

స్పాట్‌కు ఉగాది, రంజాన్ సెలవులు

ఈనెల 3నుంచి 11వతేదీ వరకు స్పాట్ పూర్తిచేయాలని తొలుత నిర్ణయించిన విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈనెల 9న ఉగాది, 11న రంజాన్ పండుగలు ఉండటంతో ఆయా రోజుల్లో కూడా స్పాట్ క్యాంపును కొనసాగుతుందని ప్రాథమికంగా నిర్ణయించారు. అయితే ప్రధాన పండుగలు కావడంతో ఆ రెండు రోజుల కూడా సెలవులు ఇవ్వాలని వినతులు వెళ్లాయి. దీంతో ఈనెల 9, 11న రెండురోజులపాటు క్యాంపునకు సెలవులు ప్రకటిస్తూ సంబంధిత అధికారులు గురువారం సాయంత్రం ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో స్పాట్ వాల్యుయేషన్ 13వరకు కొనసాగించాలని ఆదేశించారు.

ఎస్ఏ–2 టైంటేబుల్ రీ షెడ్యూల్

విద్యారణ్యపురి: ఒకటి నుంచి 9వతరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ–2) పరీక్షల టైంటేబుల్‌ను ఉన్నతాధికారులు గురువారం రీషెడ్యూల్ విడుదల చేశారు. గతంలో ప్రకటించిన విధంగా ఈనెల 8వ తేదీనుంచి ఎస్ఏ–2 పరీక్షలు నిర్వహించాల్సిండగా పలు కారణాలతో ఆ పరీక్షలను ఈనెల 15 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఓవైపు టెన్త్ పరీక్షల జవాబు పత్రాల వాల్యుయేషన్ కొనసాగుతుండడం, మరోవైపు కొందరు ఉపాధ్యాయులకు ఎన్నికల శిక్షణ విధులు ఉండడం వంటి కారణాలతో ఈటైంటేబుల్‌ను రీషెడ్యూల్ చేసినట్లు తెలుస్తోంది. ఈమేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, వివిధ గురుకులాల విద్యార్థులు పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి జిల్లాలోనూ జిల్లా పరీక్షల బోర్డు (డీసీఈబీ) ద్వారా హెచ్ఎంల ద్వారా ప్రశ్నాపత్రాలు పంపిణీ చేసి పరీక్షలు నిర్వహించబోతున్నారు.

టైంటేబుల్ ఇలా..

- ఈనెల 15న ఒకటో తరగతి నుంచి 7వ తరగతి వరకు ఉదయం 9 గంటల నుంచి 11:30 గంటల వరకు ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగు, ఉర్దూ
- 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9గంటలనుంచి ఉదయం 11:45 గంటలవరకు ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగు, ఉర్దూ, 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తెలుగు, ఉర్దూ పరీక్షలు నిర్వహిస్తారు.
- 16న 1 నుంచి 5వతరగతి వరకు ఇంగ్లిష్, 6, 7, 8, 9 తరగతులకు సెకెండ్ లాంగ్వేజ్ హిందీ, తెలుగు తదితర పరీక్షలు నిర్వహిస్తారు.
- 18న 1 నుంచి 5వ తరగతి వరకు మేథమెటిక్స్, 6, 7, 8, 9 తరగతులకు థర్డ్ లాంగ్వేజ్ ఇంగ్లిష్ పరీక్ష నిర్వహిస్తారు.
- 19న 1 నుంచి 5 తరగతులకు ఈవీఎస్, 6, 7 తరగతులకు సోషల్ స్టడీస్, 8, 9 తరగతులకు మేథమెటిక్స్ పరీక్షలు నిర్వహిస్తారు.
- 20న 6, 7 తరగతులకు జనరల్ సైన్స్, 8వ తరగతికి ఫిజికల్ సైన్స్ 9 గంటల నుంచి 11:45 గంటల వరకు నిర్వహిస్తారు. 9వ తరగతికి పేపర్–1 ఫిజికల్ సైన్స్ ఉదయం 9 గంటల నుంచి 10:30 గంటల వరకు, పేపర్–2 బయాలజికల్ సైన్స్ ఉదయం 10:45 గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు నిర్వహిస్తారు.
- 22న 6, 7 తరగతులకు మ్యాథమెటిక్స్, 8, 9 తరగతులకు సోషల్ స్టడీస్ పరీక్ష నిర్వహిస్తారు.

23న ఫలితాలు..

ఈనెల 23న విద్యార్థులకు ఫలితాలు తెలియజేస్తారు. తల్లిదండ్రుల సమావేశాలు కూడా నిర్వహిస్తారు. విద్యార్థుల మార్కులకు సంబంధించి క్యూమిలేటివ్ రికార్డులు అందజేస్తారు. 24వ తేదీ నుంచి వేసవి సెలవులు ఉంటాయి.

ఓవరాల్ చాంపియన్ కేఎంసీ

- ముగిసిన వైద్య విద్యార్థుల అథ్లెటిక్స్ పోటీలు



ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో కేఎంసీ విద్యార్థులు

వరంగల్ స్పోర్ట్స్ : కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని జేఎన్ఎస్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్ కళాశాలల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు గురువారం సాయంత్రం ముగిశాయి. ఇందులో ఆతిథ్య కేఎంసీ క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. యూనివర్సిటీ పరిధిలోని వివిధ జిల్లాల నుంచి 68 మెడికల్ కళాశాలలకు చెందిన 580 మంది వైద్యవిద్యార్థులు హాజరు కాగా, అథ్లెటిక్స్‌లోని వివిధ ఈవెంట్లలో పోటీలు నిర్వహించారు. ముగింపు వేడుకలకు యూనివర్సిటీ వీసీ కరుణాకర్‌రెడ్డి హాజరై విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు ఆడాలన్నారు. కేఎంసీ ప్రిన్సిపల్ మోహన్‌దాస్ మాట్లాడుతూ ఈ క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. నిర్వహణ కార్యదర్శి రామ్‌కుమార్‌రెడ్డి జాతీయ గీతం ఆలపించి పోటీలను అధికారికంగా ముగించారు.

రెండో స్థానంలో ఖమ్మం క్రీడాకారులు

రెండు రోజుల పాటు సాగిన అథ్లెటిక్స్ మీట్‌లో మమత మెడికల్ కళాశాల ఖమ్మం క్రీడాకారులు రెండో స్థానంలో నిలిచారు. ఇండివిజువల్ పురుషుల విభాగంలో ఉస్మానియా మెడికల్ కాలేజీ హైదరాబాద్ మొదటి స్థానంలో, మమత మెడికల్ కాలేజీ ఖమ్మం రెండో స్థానంలో నిలిచింది. ఇండివిజువల్ మహిళా విభాగంలో మొదటి స్థానంలో కేఎంసీ వరంగల్, రెండో స్థానంలో మమత కాలేజీ ఖమ్మం క్రీడాకారులు రెండో స్థానం దక్కించుకున్నారు.

వరంగల్ ఆర్డీఓ ఆఫీస్‌కు నోటీసులు

టెక్స్‌టైల్ పార్క్‌కు 12 ఎకరాలిచ్చిన రైతు స్వామి కుటుంబానికి రూ.2.40 కోట్లు ఇవ్వాలి

- ఈ నెల 10 వరకు ఇవ్వకపోతే... ఆఫీ ఆస్తులు జప్తు చేస్తాం
- ల్యాండ్ అక్విసిషన్ రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్ మెంట్ అథారిటీ స్పష్టీకరణ



అంటించిన నోటీసు కాపీ



రైతు సముద్రాల స్వామి

సాక్షి, వరంగల్ : గీసుగొండ మండలం కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ భూసేకరణలో రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిన ఎకరానికి రూ.తొమ్మిది లక్షలను సవాల్ చేస్తూ రైతు సముద్రాల స్వామి కుటుంబం.. హైదరాబాద్‌లోని ల్యాండ్ అక్విసిషన్ రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్ మెంట్ అథారిటీని ఆశ్రయించింది. దీనిపై వాదోపవాదాలు విన్న అథారిటీ.. 12 ఎకరాలకు రూ.2,40,14,171లు చెల్లించాలని ఆదేశించింది. ఈ నెల 10వ తేదీలోపు చెల్లించాలని, లేనిపక్షంలో వరంగల్ రెవెన్యూ డివిజనల్ ఆఫీస్‌లోని సామగ్రిని జప్తు చేస్తామని పేర్కొంటూ అథారిటీ సిబ్బంది గురువారం కార్యాలయానికి నోటీసులు అంటించింది. గీసుకొండ మండలం శాయంపేట హవేలికి చెందిన సముద్రాల స్వామికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో చిన్న కుమార్తె వెన్నెలకు పసుపు కుంకుమ కింద 510, 511, 448, 503, 504, 444, 509, 507, 506 సర్వే నంబర్లలోని 20 ఎకరాల భూమిని ఇచ్చారు. అయితే 2014 నుంచి 16 వరకు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు కోసం రాష్ట్ర ప్రభుత్వం భూమిని సేకరించింది. అప్పుడు రైతులకు ఎకరానికి రూ.10 లక్షల చొప్పున పరిహారం చెల్లించింది. మళ్లీ 2020లో సముద్రాల స్వామి భూమిని కూడా సేకరిస్తున్నామంటూ వారికి సమాచారం ఇవ్వడంతో అప్పటి కలెక్టర్ హరితను కలిశారు. 2014 నుంచి ఇప్పటి(2020) వరకు ఆరేళ్లు అయిందని, భూమి ధర బహిరంగ మార్కెట్‌లో ఎకరానికి రూ.50లక్షలపై ఉందని విన్నవించారు. అయినా భూసేకరణ చట్టం ప్రకారం ఎకరానికి రూ.10 లక్షలు మాత్రమే ఇస్తామని ఖరాఖండిగా చెప్పారు. ఆ సమయంలోనే పోలీసు పహారా మధ్య ఆ భూమిని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు.. ఆ ప్రాంతంలో రోడ్లు వేశారు. అయితే అప్పుడు ఐదు ఎకరాలకు (ఎకరానికి రూ.10లక్షలు) రూ.50 లక్షలు తీసుకున్న స్వామి, వెన్నెలకు మరో మూడు ఎకరాల్లో సర్వే నంబర్ తప్పుగా ఉందని పరిహారం ఇవ్వమని చెప్పడంతో కోర్టును ఆశ్రయించారు. ఈ అంశం ప్రస్తుతం కోర్టులో విచారణ జరుగుతోంది. అయితే ఈ ఎనిమిది ఎకరాలు పోనూ మిగతా 12 ఎకరాలకు కూడా ఎకరానికి రూ.తొమ్మిది లక్షలు రావడంతో, ఇది తమకు గిట్టుబాటు కావడం లేదని, 2014–16కు, 2020కు భూమి ధర బాగా పెరిగిందని, ఎకరాకు రూ.40 లక్షలు ఇవ్వాలంటూ హైదరాబాద్‌లోని ల్యాండ్ అక్విసిషన్ రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్ మెంట్ అథారిటీలో 2020లోనే అప్పీల్ చేశారు. అప్పటి నుంచి కేసు విచారణ, వాదోపవాదాలు జరిగాక 2024 ఫిబ్రవరి 27న ప్రిన్సిపల్ అమౌంట్ రూ.2,39,84,171 నగదుతో పాటు ఖర్చుల కింద రూ.30వేలు కలిపి రూ.2,40,14,171 చెల్లించాలని వరంగల్ ఆర్డీఓ కార్యాలయానికి ఆదేశాలిచ్చింది. అయినా అక్కడి నుంచి ఏమాత్రం స్పందన లేకపోవడంతో బాధితులు స్వామి, వెన్నెల తరఫు న్యాయవాది ఎగ్జిక్యూటివ్ పిటిషన్‌ను అథారిటీ ముందు దాఖలు చేశారు. దీంతో ఏప్రిల్ 10లోపు ఈ నగదు చెల్లించకపోతే ఆర్డీఓ కార్యాలయంలోని ఆస్తులు జప్తు చేస్తామని ఇచ్చిన తీర్పు ప్రతిని ఆర్డీఓ ఆఫీసులో అంటించారు. అయితే ఇప్పుడు ఈ విషయంపై ఆర్డీఓ, కలెక్టర్ ఏం చేస్తారనే అంశం ఆసక్తికరంగా మారింది.

వివాహానికి వెళ్లొస్తూ.. మృత్యుఒడికి..

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

- ఇద్దరి పరిస్థితి విషయం..
- కారు అదుపు తప్పి మరో కారుకు ఢీ
- జనగామ– సూర్యాపేట రహదారి రక్తసిక్తం
- దేవరుప్పల మండలం ధరావత్ తండా పరిధిలో ఘటన





సాయికుమార్ మృతదేహం. చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

దేవరుప్పుల : జనగామ–సూర్యాపేట రహదారి రక్తసిక్తమైంది. సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలో గురువారం రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం చెందగా, మరో 12 మందికి తీవ్ర, స్వల్ప గాయాలయ్యాయి. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్సై ఎస్ చెన్నకేశవులు కథనం ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నారపల్లికి చెందిన గ్యార సాయికుమార్(27) తన మిత్రుల (మొత్తం ఎనిమిది మంది)తో కలిసి ఎర్టిగా కారులో సూర్యాపేట జిల్లా తిర్మలగిరిలో జరిగిన వివాహ వేడుకకు వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణంలో జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలో ధరావత్‌తండా పరిధి(చింత బాయి) వద్ద ఎదురుగా వస్తున్న దేవరుప్పులకు చెందిన షిఫ్ట్ కారు (ఇందులో మొత్తం ఐదుగురు ఉన్నారు)ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో గ్యార సాయికుమార్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా ఇందులో ఎర్టిగా కారు డ్రైవర్ బండి ప్రవీణ్‌తోపాటు మరోనలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా, షిఫ్ట్ కారు డ్రైవర్ దాసగాని రంజిత్, చెన్నూరు పాషాకు తీవ్రగాయాలుకాగా మిగతా ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఇందులో డ్రైవర్లు ప్రవీణ్, రంజిత్ పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు వెంటనే క్షతగాత్రులను అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, ఎస్సై ఎస్ చెన్నకేశవులు ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అనంతరం పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి పర్యవేక్షణలో ఏరియా ఆసుపత్రిలో క్షతగాత్రుల వివరాలను సేకరించి కేసు నమోదు చేశారు.

ఆసుపత్రి వద్ద మిన్నంటిన రోదనలు..

రోడ్డు ప్రమాదానికి గురైన ఇరువురు వాహనదారులు తమ మిత్రుల వివాహానికి వెళ్లొస్తూ స్వగ్రామాలకు చేరుకునే క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కాగా, ఆసుపత్రి వద్ద ఇరువురు కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహాల మీద పడి రోదించిన తీరు ప్రతీ ఒక్కరిని కదలించింది. ఘటనా స్థలిలోనే మృతి చెందిన గ్యార సాయికుమార్, అపస్మారక పరిస్థితిలోకి వెళ్లిన షిఫ్టుకారు డ్రైవర్ దాసగాని రంజిత్‌ను ఇరువురు సహచరులు లేపే యత్నం చూసేవారిని కంటతడికి గురి చేసింది. కాగా, రెండు కార్ల బెలూన్‌లు ఓపెన్ కావడంతో ఇరువురు డ్రైవర్లు ప్రాణపాయం నుంచి బయటపడడమేగాక మిగతా వారికి ప్రాణపాయం తప్పింది.

నలుగురు దొంగల అరెస్ట్

- సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు

గీసుకొండ : గీసుకొండ పోలీస్ స్టేషన్ పరిధి వందఫీట్ల రోడ్డు పరిధిలో కిరాణా షాపుతోపాటు ఆ షాపుపై ఇంట్లో ఉన్న బంగారం, నగదు, ఇతర సొత్తును ఎత్తుకెళ్లిన నలుగురు దొంగలను గురువారం అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఎల్. పవన్‌కుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. దొంగలు గత నెల 21న వందఫీట్ల రోడ్డులోని కిరా ణా షాపు తాళం పగులగొట్టి అందులోని డబ్బులు, ఇతర వస్తువులతో పాటు షాపు పై ఉన్న ఇంట్లోని లాకర్‌లో ఉన్న బంగారం ఎత్తుకెళ్లారు. ఇంటి యజమాని మండల గుణశ్రీ ఫిర్యాదు మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య, ఫింగర్ ప్రింట్స్ ఆఫీసర్ శ్రీధర్, ఐడీ అసిస్టెంట్ సల్మాన్,సిబ్బంది సహకా రంతో దొంగలను పట్టుకున్నారు. మహబూబాబాద్ టౌన్‌కు చెంది ప్రస్తుతం హనుమకొండలో ఉంటున్న భూక్య వంశీ, న్యూశాయంపేటకు చెందిన ఆవునూరి సాయితేజ, కాకిలేటి సామ్ అనుగ్రహంతో పాటు ఓ బాలనేరస్తుడిని అదుపులోకి తీసుకుని వారి నుంచి చోరీ చేసిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వీరు గతంలో గీసుకొండ, ఏనుమాముల, మిల్స్ కాలనీ పీఎస్‌ల పరిధిలో రెండు చొప్పున మొత్తం ఆరు చోరీలకు పాల్పడినట్లు పేర్కొన్నారు.

మార్కెట్‌కు 5 రోజులు సెలవు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం నుంచి మంగళవారం వరకు వరుసగా 5రోజులు సెలవులు ఉన్నాయని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి సంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తేదీ బాబూజగ్జీవన్‌రాం జయంతి, 6న వారాంతపు యార్డు బంద్, 7న వారంతపు సెలవు, 8న అమావాస్య, 9న 'ఉగాది' పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉందన్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్ బంద్ ఉంటుందన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఆయన కోరారు.

కుంటలో పడి రైతు మృతి



కనకయ్య మృతదేహం

బచ్చన్నపేట : నీటి కుంటలో పడి రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని కట్కూర్‌లో జరిగింది. ఎస్సై సతీష్‌కుమార్ తెలిపిన కథనం ప్రకారం.. కట్కూర్ గ్రామానికి చెందిన రైతు గుజ్జుల కనకయ్య(55) బుధవారం సాయంత్రం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. పక్కనే ఉన్న కొంత భూమిని కౌలుకు తీసుకు తీసుకొని వరిపంట సాగు చేస్తున్నాడు. కాగా వరిపైరుకు నీరు పెట్టేందుకు ఏర్పాటు చేసిన కుంటలో పడి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. గురువారం ఉదయం వెళ్లి చూడగా కుంటలో చెప్పులు తేలి ఉండడంతో అందులో నీటిని బయటరే తోడి వేయగా శవం తేలింది. కనకయ్య ఫిట్స్ వచ్చి కుంటలో పడి మృతి చెంది ఉంటాడని మృతుడి కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు ఇచ్చాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య రమాదేవి, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఎంహెచ్ నగర్‌లో యువకుడు..



రంజిత్(ఫైల్)

వరంగల్ : ఎంహెచ్ నగర్‌కు చెందిన దుప్పటి రంజిత్(28) ఏనుమాములలోని ముసలమ్మకుంటలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం సాయంత్రం తాపీమేస్త్రి పనులు చేసిన రంజిత్, మరో యువకుడితో కలసి సరదాగా ఈత కొడుతుండగా కుంట మధ్యలో వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయినట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం మృతుడి శవం కుంటలో తేలింది. మృతుడి భార్య కీర్తన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పులి రమేష్ తెలిపారు.